నిజం మా నైజం...!

RNI NO:TELTEL/2022/81794

# వాస్తవ తెలంగాణ

VASTHAVA TELANGANA DAILY

తెలుగు దినపత్రిక

PUBLISHED FROM: TELANGANA & ANDHRAPRADESH

www.vasthavatelangana.com

ఎడిటర్ : చింతల రామకృష్ణ సంపుటి: 3 సంచిక: 254 మంగళవారం, 06 జనవరి, 2025 పేజీలు - 4 వెల : 3/-






## రేవంత్ రెడ్డికి ఢిల్లీ పెద్దలు
# సహకరించడం లేదు

కేసీఆర్ రూ. 7 లక్షల కోట్ల అప్పు చేశారని కేఏ పాల్ విమర్శ
రాష్ట్రాన్ని దోచుకున్నారని మండిపాటు
రేవంత్ వచ్చిన తర్వాత అప్పులు మరింత పెరిగాయని వ్యాఖ్య



## చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఎప్పుడూ రైతుల మేలు కోసమే ఆలోచిస్తారు

- గత ప్రభుత్వం రైతులను విస్మరించిందన్న నాదెండ్ల
- రైతులకు సరిగా ధాన్యం డబ్బులు ఇవ్వలేదని విమర్శలు
- కూటమి ప్రభుత్వం రైతు కుటుంబాల్లో సంక్రాంతి తీసుకొచ్చిందని వెల్లడి

## ఆరాంఘర్ - జూపార్క్
# ఫ్లైఓవర్ ప్రారంభోత్సవం




- నగరంలో రెండో అతి పెద్ద ఫ్లైఓవర్ అరాంఘర్ - జూపార్క్ పైవంతెన
- నగరంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారంలో ఇది ఒక ముందడుగు.
- 800 కోట్ల వ్యయంతో నిర్మాణం పూర్తి చేసుకున్న అరాంఘర్- జూపార్క్ ఫ్లైఓవర్
- నగర ప్రజల అవసరాలకు తగ్గట్టు మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

4లో

## హైదరాబాద్‌లో
# మంత్రిగారి మంత్రాంగం!

- ఆయన సంగతి కాస్త చూసుకోండి
- ఏపీ ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసిన టీ-సర్కారు
- ఆయన తొలిసారి మంత్రి.. బాగా కీలక పదవి
- వారంలో మూడురోజులు హైదరాబాద్‌లోనే..
- స్టార్ హోటళ్లలో మకాం.. అక్కడే సెటిల్‌మెంట్లు
- ఒక రోజంతా పంచాయతీలు, పరిష్కారాలు
- మిగిలిన రెండు రోజులూ జోరుగా గానాభజానా
- ఎమ్మెల్యేగా ఉన్నప్పటినుంచీ ఇదే వరస
- మంత్రి అయిన తర్వాత మరింత జోరు
- ఏపీలో పని ఉన్నవారంతా అక్కడే బారులు
- తెలంగాణ భూవ్యవహారాల్లోనూ జోక్యం
- ఆ మంత్రి తీరుపై తెలంగాణ సర్కారు నిఘా
- శ్రుతి మించుతోందంటూ బాబుకు సమాచారం




## 2026 మార్చి నాటికి దేశంలో
# నక్సల్స్ కథ ముగిస్తాం



- ఛత్తీస్ గఢ్ లో పంజా విసిరిన మావోలు
- 9 మంది జవాన్ల మృతి
- వచ్చే ఏడాది కల్లా దేశంలో నక్సలిజాన్ని నిర్మూలిస్తామన్న అమిత్ షా

## దేశంలో ఒకే రోజు మూడు
# హెచ్ఎంపీవీ కేసులు

- భారత్‌లో హెచ్ఎంపీవీ వైరస్ కేసులు తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నాయి.
- ఇప్పటికే కర్ణాటకలో రెండు కేసులు
- గుజరాత్‌లో ఒక చిన్నారికి తాజాగా ఈ హెచ్ఎంపీవీ వైరస్
- ప్రస్తుతం భారత్‌లో ఒకే రోజు 3 కేసులు పాజిటివ్ కావడంతో కేంద్ర ప్రభుత్వం అలర్ట్
- ఈ హెచ్ఎంపీవీ వైరస్ గురించి అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది.




## పనుల్లో పారదర్శకత
# పెంచేలా!



- ఉపాధిహామీ పథకం కోసం ప్రత్యేక యాప్
- జన్‌మన్‌రేగ యాప్‌లో పూర్తి సమాచారం
- అవకతవకలపై ఫిర్యాదుకు అవకాశం

ప్రభుత్వం ఈ యాప్‌ను రూపొందించినప్పటికీ ఇంకా ప్రజల్లోకి వెళ్లలేదు. దీంతో చాలా మంది కూలీలు డబ్బులు పడకపోవడం తదితర సమస్యలతో కార్యాలయాల చుట్టూ తిరుగుతన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో కూలీలకు యాప్‌పై అవగాహన కల్పిస్తే ప్రయోజనకరంగా ఉంటుంది.

## రఘురామ నివాసంలో కార్యకర్తలతో
# భేటీ అయిన నారా లోకేశ్

- టీడీపీలోనే కార్యకర్తలకు పెద్దపీట
- ఉండి నియోజకవర్గంలో నారా లోకేశ్ పర్యటన
- రఘురామ నివాసంలో టీడీపీ కార్యకర్తలకు దిశానిర్దేశం
- కార్యకర్తలకు అత్యంత విలువనిచ్చే పార్టీ టీడీపీయేనని స్పష్టీకరణ



తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఉండి నియోజకవర్గ పర్యటనలో భాగంగా అమిరంలోని శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు నివాసాన్ని మంత్రి లోకేశ్ సోమవారం మధ్యాహ్నం సందర్శించారు.


## సంపాదకీయం

### ఆదివాసుల సమస్య అడవికే పరిమితమా?

కష్టాలు వేరుబీ అణిచివేత వేరు. కష్టాలు అందరికీ వుంటాయి. గౌతమ్ ఆదానీకీ, నరేంద్ర మోదీకీ కూడా కష్టాలు వుంటాయి. ప్రపంచంలో అందరికన్నా ఎక్కువగా అణచివేతకు గురవుతున్నది ఎవరూ? అని ప్రశ్నించుకుంటే మాత్రం మనకు రెండు సమూహాలు గుర్తుకు వస్తాయి. మొదటిదిబీ ఆదివాసులు. రెండోదిబీ ముస్లింలు. ఆదివాసీ, ముస్లిం సమూహాలు ఈ భూమి మీద వుండడం మెగా కార్పొరేట్లకు ఇష్టం లేదు. ఎందుకంటే, ఆదివాసుల కాళ్ళ కింద వుండే ఖనిజాలు, ముస్లిం దేశాల్లో వున్న చమురు నిల్వలు మొత్తంగా వాళ్ళకు కావాలి. రాజకీయాలను, ఆర్థిక వ్యవస్థను మనం తరచూ విడదీసి చూస్తుంటాం. అవి ఒకే శరీరానికి వున్న రెండు తలలు అనుకోం. పైగా, మోదీ ప్రధాని కావడం వల్ల కొన్ని మెగా కార్పొరేట్ల సంపద పెరుగుతోంది అనే అపోహలో ఉంటాము. కానీ తమ సంపదను పెంచుకోవడానికి మెగా కార్పొరేట్లు తగిన ప్రధానమంత్రిని కూడా ఎన్నుకోగలవేమో అన్న ఆలోచన మనకు రాదు. ఆదివాసులు, ముస్లింలను అంతరించిపోతున్న జాతులు అనాల్సినంతగా పరిస్థితులు మారిపోతున్నాయి. చంపాల్సిన కుక్కను పిచ్చిది అని ప్రచారం చేయాలన్నది ఓ కుటిలనీతి. ఇప్పుడు ఆదివాసులు, ముస్లింల మీద అలాంటి కుటిల ప్రచారమే జరుగుతున్నది. “ఆదివాసులు అనాగరీకులుబీ ముస్లింలు మూరు?లు”...– ఇదీ ఆ ప్రచారం సారాంశం. ఈ ప్రచారాన్ని ఎక్కువమంది నమ్మరు. కానీ ఓటర్లలో ఓ మూడోవంతు నమ్మి ఓటేసినా దేశాధినేతలు మళ్ళీమళ్ళీ గెలువగలరు. ఆ మధ్య కేంద్ర ప్రభుత్వం ఉమ్మడి పౌర స్మృతిని (%ఖజజ%) అమలు చేయాలని ఒక ప్రయత్నం మొదలెట్టింది. ముస్లిం సమూహాన్ని ఇబ్బంది పెట్టడానికి తాము ఒక చట్టాన్ని తెస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వ పెద్దలు గట్టి సంకేతాలు ఇచ్చారు. తమ ప్రత్యేక ఉనికిని కోల్పోతున్నట్టు ముస్లిం సమాజం కూడ ఆందోళన చెందింది. మైదాన సమాజం ‘అనాగరికులు’ అంటూ తరచూ కించపరిచే ఆదివాసులకు ఈ చట్టం వెనుకనున్న అసలు కుట్ర అర్థం అయింది. మన దేశంలో ప్రస్తుతం ఏడు వందల రకాల ఆదివాసీ సమూహాలు ఉన్నాయి. ప్రతి ఒక్క సమూహమూ ప్రత్యేకమైన ఆచార వ్యవహారాలని పాటిస్తాయి. వైవిధ్యపూరితమైన తమ సంస్కృతిని అంతం చేయడానికే ఉమ్మడి పౌర స్మృతిని తెస్తున్నట్టు వాళ్ళకు బోధపడింది. ఆదివాసి సంఘాలు ఝార ఖండ్‌లో పెద్ద సభ జరిపి ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళన చేయాలని తీర్మానం చేశాయి. నక్సల్‌బరీ –శ్రీకాకుళం రైతాంగ సాయుధ ఉద్యమాల రూపంలో భారత గడ్డ మీద కమ్యూనిజానికి తిరిగి ప్రాణం పోసింది ఆదివాసులే. ఆ ఉద్యమాలను చూసి ఉలిక్కిపడిన ప్రభుత్వాలు మైదాన ప్రాంతాల్లో భూపరిమితి చట్టాల్ని, అటవీ ప్రాంతాల్లో ఆదివాసీ భూముల పరిరక్షణ చట్టాల్ని తెచ్చాయి. ఇప్పుడు ఆ చట్టాలను వరుసగా రద్దుచేసే పనిలో పడ్డాయి. మణిపూర్‌లోని కొండలు అటవీ భూముల మీద ఆదివాసులైన కుకీ–జోలకు సాంప్రదాయిక హక్కు ఉంది. లోయలో ఉండే నాగరీకులయిన మెయితీలకు కూడా కొండలు, అటవీ భూముల మీద హక్కు కల్పిస్తూ కొత్త చట్టం చేయడంతో అక్కడ మంటలు రాజుకున్నాయి. ఇదంతా బహిరంగ రహస్యమే. దీని వెనుక అంతకుమించిందేదో ఉందని కుకీ–జోలకు గట్టి అనుమానం. ఏడాదిన్నరగా అల్లర్లు చెలరేగుతున్నా మణిపూర్ మీద ప్రధాని కనీసం స్పందించలేదు. వారు మౌనంగా వుంటూనే పార్లమెటులో ఇంకో పని చేశారు. అంతర్జాతీయ సరిహద్దుల నుండి వంద కిలోమీటర్ల లోపు ఉన్న అటవీ భూముల్ని దేశ ప్రయోజనాలకు అవసరమైన వ్యూహాత్మక ప్రాజెక్టుల కోసం వాడుకునేలా చట్ట సవరణ చేశారు. ఇండియాకు ఏడు దేశాలతో అంతర్జాతీయ సరిహద్దులు ఉన్నాయి. వీటి పొడవు 15 వేల కిలోమీటర్లు. ఆ లెక్కన అటవీ భూముల సవరణ చట్టం కేటాయించిన భూముల విస్తీర్ణం దాదాపు 15 లక్షల చదరపు కిలోమీటర్లు. అంటే, 37 కోట్ల ఎకరాలు. ఇంతటి విస్తీర్ణమయిన భూమిని ఎవరి కోసం సేకరిస్తున్నారూ అనేది ఇప్పుడు చాలామందిని వేధిస్తున్న ప్రశ్న. దేశానికి వ్యూహాత్మక ప్రాజెక్టులంటే రక్షణ శాఖ ప్రాజెక్టులని ఎక్కువమంది భావిస్తారు. ఆదానీ, అంబానీలకు అవసరమైన భూముల్ని కూడ కేంద్ర ప్రభుత్వం దేశ ప్రయోజనాలకు అవసరమైన వ్యూహాత్మక ప్రాజెక్టులుగా పరిగణించే వీలు లేకపోలేదు. ఈశాన్య రాష్ట్రాల్లో మణిపూర్‌తో సహా అనేకం ఈ వంద కిలోమీటర్ల పరిధిలోకి వస్తాయి. అంటే వ్యూహాత్మక ప్రాజెక్టులు వస్తే ఈ రాష్ట్రాలు అంతరించిపోతాయి. దేశంలోని రేవు పట్టణాలన్నీ ఈ పరిధిలోనికే వస్తాయి. ఆ వంద కిలోమీటర్ల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా ఎలాంటి అధికారాలు వుండవు. మణిపూర్ మీద ఎందుకింత ప్రత్యేక ఆసక్తి? అనేది ఎవరికయినా రావలసిన సందేహం. ఈ సందర్భంగా అనేక వాదనలు వినిపిస్తున్నాయి. మణిపూర్‌ను ఆనుకుని మయన్మార్, లావోస్, థాయిలాండ్ దేశాలున్నాయి. మెకాంగ్, రువాక్ నదులు ఇక్కడే కలుస్తాయి. ఈ మూడు దేశాల సరిహద్దులు కలిసే ప్రాంతానికి ‘గోల్డెన్ ట్రయాంగిల్’ (బంగారు త్రిభుజి) అనే పేరుంది. ఓపియం, హెరాయిన్ వంటి మాదకద్రవ్యాలకు ఇది ప్రపంచ కేంద్రం. పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్ సరిహద్దులు కలిసే ప్రాంతాన్ని ‘గోల్డెన్ క్రిసెంట్’ (బంగారు నెలవంక) అంటారు. అది సహజ మాదకద్రవ్యాల కేంద్రమయితే, ‘బంగారు త్రిభుజి’ సింథటిక్ మాదకద్రవ్యాల కేంద్రం. ‘యాబా’ అని పిలిచే మెథంఫెటమైన్ సింథటిక్ మాదకద్రవ్యం వాణిజ్యం ఇటీవల ఈ ప్రాంతంలో విపరీతంగా పెరిగింది. డ్రగ్స్‌తో పాటు ఆయుధాలు, కమర్షియల్ సెక్స్ రవాణాలకు ఇది ట్రాన్సిట్ పాయింట్. ప్రపంచ వాణిజ్యంలో నిజానికి ఆయుధాలకన్నా మాదకద్రవ్యాలది చాలా పెద్ద వాటా. ఐక్యరాజ్య సమితి ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్ అంచనా ప్రకారం మాదకద్రవ్యాల వాణిజ్యం 426 బిలియన్ డాలర్లు. ఆయుధాలకన్నా మాదకద్రవ్యాల అమ్మకాలు నాలుగు రెట్లు ఎక్కువగా వుండడానికి కారణం ఏమంటే, మనుషులు ఆయుధాలను ఎప్పుడో ఒకసారి వాడుతారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడితే ప్రతిరోజూ వాటిని కొనాల్సి వుంటుంది. అంచేత, వాణిజ్యంలో భారీ టర్నోవర్ ఆశించే మెగాకార్పొరేట్లు ఇప్పుడు మాదకద్రవ్యాల మీద దృష్టిపెట్టారని, గోల్డెన్ ట్రయాంగిల్ మీద పట్టుకోసమే మణిపూర్‌ను మండిస్తున్నారని కుకీ సంఘాలు ఆరోపిస్తున్నాయి. అడవుల నుండి ఆదివాసుల్ని తరిమేస్తున్నట్టే పట్టణ శ్రామికవాడల నుండి ముస్లింలని ఒక పథకం ప్రకారం బుల్‌డోజర్లతో తరిమేస్తుండడాన్ని మనం తరచూ చూస్తున్నాం. భారత ముస్లింలలో కొందరు వ్యాపారులు, కొండొకచో కార్పొరేట్లు కూడ ఉన్నారు. కానీ, అత్యధికులు యంత్రయుగపు కులవృత్తుల్లో జీవిస్తున్నారు. మెగా కార్పొరేట్ల ఆగడాలు అడవులకే పరిమితంకావు. ఆదానీ గ్రీన్ ఎనర్జీ సంస్థ నుండి పాతికేళ్ళపాటు సోలార్, పవన విద్యుత్తును అధిక ధరకు కొనడానికి జగన్ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. దీని కోసం నీకెంత నాకెంత (%ubఅబఅఎ జూతీశీ నబశీ%) పద్ధతిలో భారీగా ముడుపులు అందుకుందని ఇటీవల అంతర్జాతీయ వేదికల మీద పెద్ద దుమారం రేగడం మనకు తెలుసు. ఒప్పుకున్న షరతుల ప్రకారం భారీ నష్టపరిహారాన్ని చెల్లించాలి గనుక ఈ ఒప్పందాన్ని రద్దు చేసుకోవడమూ చంద్రబాబు ప్రభుత్వానికి కుదరదు. ఫలితంగా ఆ భారాన్ని రాష్ట్ర ప్రజలే భరించాల్సి వుంటుంది.

# హిందువులకు మార్గదర్శకులు ఎవరు?

హిందూ సమాజానికి సూచనలు, ఆదేశాలు ఇచ్చే అధికారం ఎవరిది అనే విషయంపై గత కొన్ని రోజులుగా ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. హిందూ సాంస్కృతిక సంస్థగా చెప్పబడే ఆర్ఎస్ఎస్ అధినేత ఒక ముఖ్య సూచనను ఇచ్చాడు. ప్రతి మసీదు వెనుక ఒక శివలింగాన్ని వెతకవద్దు అని హిందూ సమాజానికి, స్థానిక నాయకులకు ఒక సూచన ఇచ్చాడు. భారతదేశం ఒక శక్తివంతమైన దేశంగా ఎదగాలని, అది అందరూ కలిసి ఉన్నప్పుడే సాధ్యమవుతుందని చెప్పాడు. అలాగే మరొకచోట మాట్లాడుతూ మతం పేరిట గతంలో ఎన్నో హింసలు, ఘోరాలు అత్యాచారాలు జరిగాయి. అవన్నీ మతం స్వరూపంపై, ధర్మం అంటే ఏమిటి అనే విషయంపై అవగాహన లేక జరిగిన ఘోరాలు అని వ్యాఖ్యానించాడు. మత గ్రంథాలపై మానవ విలువల వెలుగులో సరైన వ్యాఖ్యల్ని తీసుకురావాలని కూడా చెప్పాడు. పై సూచనపై ప్రముఖ మతాచార్యులు తీవ్రంగా స్పందించారు. హిందూ మతాన్ని గూర్చి సమాజానికి ఆదేశాలు ఇచ్చే అధికారం తమకే ఉన్నదని, సామాజిక సంస్థల నేతలకు లేదని చెప్పారు. ‘మేం అతనికి ఆదేశాలిస్తాము, అతను మాకు ఇవ్వడం కాదు,’ అంటూ ఇంకా కొంత తీవ్రంగా, ఆ నేత తుష్టీకరణ విధానానికి లొంగిపోయాడని, నాయకుడు కావాలనే ఆశతో ఉన్నాడని కూడా ఆరోపించారు. ఈ ఇద్దరూ హిందూ పక్షపాతులే. వారివి కేవలం భిన్న అభిప్రాయాలు కావచ్చు లేదా మరి ఎవరికైనా సంకేతం కావచ్చు. ఆ విషయంలోకి పోకుండా వారి మాటలను కేవలం ఒక చర్చ విషయంగా తీసుకొని విశ్లేషించడానికి ప్రయత్నిస్తాను. ఇంతకూ ఆర్ఎస్ఎస్ నేత మాట్లాడినది ఏమిటి? స్థానిక నాయకులు సంయమనం పాటించాలని, అత్యుత్సాహానికి పోకూడదని చెప్పారు. కొత్త అంశాలని లేవనెత్తవద్దని ఆయన చెప్పడం స్పష్టంగా ఉంది. ఇదివరకే వివాదంలోనూ, చర్చల్లోనూ ఉన్న విషయాలను వదిలి కొత్త విషయాల్ని పెంచుకుంటూ పోతే అనేక చోట్ల ఘర్షణ వాతావరణం పెరుగుతుంది. దేశంలో ప్రతి మసీదు వెనుక ఒక దేవాలయం ఉన్నదని ఆందోళన చేస్తే దేశం వాతావరణం మొత్తం కలుషితమవుతుంది. దేశం ఆర్థికంగా ప్రగతి సాధించాల్సిన సమయంలో అంతర్గత సమస్యలను పెంచుకుంటూ పోతే అది భారతదేశాన్ని నిర్వీర్యం చేయాలని ప్రయత్నిస్తున్న శక్తులకు సహాయం చేసినట్లు అవుతుంది. వారికి ఒక ఆయుధాన్ని ఇచ్చినట్లు అవుతుంది. ఆర్ఎస్ఎస్ నేత ఇచ్చిన రెండవ సలహా అన్ని మతాలకు అన్వయించేది. చరిత్రలో ఘోరాలు, నరమేధాలు చేసిబీ ప్రపంచమంతా తమ మతం మాత్రమే ఉండాలని శాశ్వత అజెండా ఉన్న మతాలు హిందూ మతాన్ని నిర్మూలించాలని ప్రయత్నాలు చేస్తున్న విషయం అందరికీ తెలుసు. హింసను ప్రోత్సహించే విధంగా తమ మత గ్రంథాలను అర్థం చేసుకున్నారని, మతం స్వరూపాన్ని, భగవంతుని స్వరూపాన్ని అర్థం చేసుకొని తమ గ్రంథాలను వ్యాఖ్యానించి ఆచరించాలని ఆయన సూచన. హిందూ సమాజానికి కూడా పై సూచన వర్తిస్తుంది. హిందూ సమాజంలో నరమేధాలు లేకపోయినా కొన్ని వర్గాల వారిని సామాజికంగా దూరం పెట్టడం అనే మానసిక హింస ఉంది. ఒకనాడు ఏ కారణాల వల్ల సమర్థించుకున్నా అలాంటి వివక్షకు ఈనాటి మానవ



విలువలు పూర్తిగా వ్యతిరేకం. ఈ విషయంలో హిందూ మతాచార్యులు ఆలోచించాలని కూడా ఆయన మాటకు అర్థం. పై చర్చ వల్ల సామాన్య హిందువు మనసులో ఒక ప్రశ్న వస్తుంది. హిందూ సమాజానికి సూచనలను ఇచ్చే అధికారం ఎవరికి ఉంది? కేవలం ధర్మాచార్యులే ఇవ్వాలా, మరి ఎవరికీ అధికారం లేదా? సమాజ శ్రేయస్సు గురించి ఎవరు సలహా ఇచ్చినా అది ధర్మమే అవుతుంది. సమాజానికి హాని కలిగించే ప్రయోగాల్ని ఎవరు చేసినా అది అధర్మమే అవుతుంది. దీర్ఘకాలికంగా దేశానికి మేలైన మార్గం ఏమిటి అని ఆలోచించే అధికారం ప్రతి ఒక్కరికీ ఉంది. ధర్మసూక్ష్మాలను కేవలం ధర్మాచార్యులే చెప్పగలరా మరి ఎవరికీ అధికారం లేదా అన్న విషయంపై భారతంలోనే రెండు కథలు ఉన్నాయి. ఒకటి కౌశికుడు అనే బ్రాహ్మణుడు ధర్మవ్యాధుడు అనే కటికవాడి వద్దకు వెళ్లి ధర్మాన్ని గూర్చి తెలుసుకోవడం. మరొకటి శాంతి పర్వంలోనిది. గొప్ప తపస్సు చేసిన జాజలి అనే బ్రాహ్మణుడు తులాధారుడు అనే ఒక సాధారణ వర్తకుడి వద్దకు వెళ్లి ధర్మ సూక్ష్మాన్ని తెలుసుకోవడం. ఏదైనా ఒక సందర్భంలో మనం చేయాల్సిన పని ధర్మబద్ధమో కాదో తెలుసుకోవాలంటే ఎవరో ఆచరించిన విధానాన్ని అనుసరించడం కాకుండా మనం మన బుద్ధితో విచారించి ధర్మాన్ని నిర్ధారించుకోవాలని తులాధారుడు చెప్తాడు. ఇలాంటి ఉదాహరణలు పురాణాల్లోనూ అనేకాలు ఉన్నాయి. అందువల్ల ఎవరి పరిధి ఎంతవరకు ఉన్నది అని పరిమితిని విధించలేము. ప్రతి ఒక్కరికి ఆలోచించి విమర్శించే అధికారం, అవకాశం ఉన్నాయి. అందువల్లే 14వ శతాబ్దంలోనే వచ్చిన ‘సర్వదర్శన సంగ్రహం’ అనే పుస్తకంలో ఆనాటి హిందూ సమాజంలో 16 దర్శనాలు ఉన్నట్లు చూడగలం. హిందూ ధర్మాచార్యులు కొత్త వివాదాల్ని సమర్థించడం వల్ల సమాజం ఒకటవుతుందని భావిస్తున్నారా అని ఆలోచించాలి. నిజానికి హిందూ సమాజం వీరితో ఉందా అన్నది కూడా ఒక ప్రశ్న. ఇలాంటి చర్యల వల్ల హిందూ సమాజంలోనే చాలామంది వీరికి ఇదివరకే దూరంగా ఉన్నారు, మరికొందరు దూరమయ్యే పరిస్థితి ఉంది. హిందూ ఐక్యత జరగకపోగా మిగతా వర్గాల వారిని ఏకం చేసినట్లు అవుతుంది. మతాచార్యులు దీన్ని కూడా ఆలోచించాలి. హిందూ ధర్మాచార్యులు చేయగలిగిన, చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి. హిందూ ఐక్యత దేశ రక్షణకు, దేశ సమగ్రతకు ఎంత అవసరమో ప్రజలకు తెలపాలి. దేశంలో ఘర్షణ వాతావరణం లేకుండా, దేశ సమగ్రతకు భంగం కాకుండా హిందువుల ఐక్యత ఉన్నప్పుడు, హిందువులు తమ సంస్కృతి గొప్పతనాన్ని తెలుసుకున్నప్పుడు ఇతర వర్గాలు వారు కూడా తమ మత స్వతంత్రాన్ని కలిగి భయం లేకుండా కలిసి ఉండవచ్చు. అన్నింటికన్నా ముఖ్యంగా హిందూ ఆచార్యులు చేయగలిగిన పని హిందూ మతంపై వచ్చిన అనేక విమర్శలకు సమాధానాలు చెప్పడం. ఉదాహరణకు సనాతన ధర్మం అంటేనే కులం అని అందరి మనసులో నాటుకొని ఉన్నప్పుడు హిందువులు ఎందుకు మతాచార్యుల వెంట ఉండాలి? సనాతన ధర్మానికి కులానికి సంబంధం లేదు. సనాతన ధర్మం కులాన్ని సృష్టించినట్లు మన పుస్తకాలు అన్నింటినీ తిరగవేసినా ఎక్కడా కనిపించదు. కేవలం మనిషి స్వభావాన్ని బట్టి నాలుగు వర్ణాలను చెప్పారు కానీ సమాజంలో ఉన్న వేలకొద్దీ కులాల గురించి ఎవరూ చెప్పలేదు. మనుస్మృతిలో ఉంది కదా అని అడగవచ్చు. మనువు కాలానికే సమాజం చాలా అభివృద్ధి చెందింది. ఈనాడు సమాజంలో ఉన్న అన్ని రకాల లిటిగేషన్లు, వ్యాజ్యాలు అప్పుడు కూడా ఉన్నాయి, అందులో వివరింపబడ్డాయి కూడా. వర్ణసంకరం వల్ల పుట్టిన వారిని అదివరకే ఉన్న కులాలలో మనువు చేర్చాడు. అంతేకానీ అతను కొత్త కులాలను సృష్టించలేదు. బ్రాహ్మణులు కులాన్ని సృష్టించలేదనే విషయాన్ని అంబేడ్కర్ స్వయంగా చెప్పాడు. ఏ ఋషి కూడా కులాన్ని సృష్టించలేదు. మనుషుల్ని నిలబెట్టి నీవు ఆ పని చేయి, నీవు ఈ పని చేయి, నువ్వు గుడ్డలు నేయాలి, నువ్వు ఉతకాలి అంటూ ఎవరూ ఎప్పుడూ చెప్పలేదు. సమాజం అవసరాల్ని బట్టి ఏర్పడినవి కులాలు. హిందూ ధర్మాచార్యులు ఈ విషయాన్ని స్పష్టం చేయాలి. కుల ఆచారాల్ని వదలమని చెప్పాల్సిన పనిలేదు, కులాల సృష్టికి మతంతో సంబంధం లేదని మాత్రం చెబితే చాలు. ముఖ్యమైన వివాదాస్పద విషయాలపై, సమాజంలో పేరుకుపోయిన సందేహాల గురించి ధర్మాచార్యులు సమాధానం చెబితే హిందువుల్లో ఐక్యత దానంతట అదే వస్తుంది. కులాల విషయంలో ప్రభుత్వాల పాలసీ ఎలా ఉన్నా మతాచార్యులకు అనవసరం. రాజకీయ పార్టీలు తమ అవసరాలకు కులాన్ని వాడుకోవచ్చు. ధర్మాచార్యులు మాత్రం వైదిక సిద్ధాంతంలో ఉన్న విషయాన్ని ప్రజలకు స్పష్టంగా చెబితే చాలు. అంతేకాక విద్యావంతులు ఎవరైనా ధర్మాన్ని గురించి విశ్లేషించి వ్యాఖ్యానించే సంప్రదాయం మన సమాజంలో ఉంది. అలాంటి స్వేచ్ఛ ఉండడం మన సంస్కృతి గొప్పదనం. దానికి మనం గర్విద్దాం.

– కె. అరవిందరావు
మాజీ డీజీపీ

# మైలారం గుట్టపైన మైనింగ్ భూతం!

ప్రకృతిని గర్భశోకానికి గురిచేయకుండా అభివృద్ధి సాధించడం మన పాలకులకు సాధ్యం కాదా? అభివృద్ధి పురోగమనానికి ప్రకృతి విధ్వంసం పూర్వ రంగం కావాలని అర్థశాస్త్రంలో ఎక్కడా లేదు. కానీ ప్రకృతి విధ్వంసం చేయకుండా, జీవావరణాన్ని దెబ్బతీయ కుండా అభివృద్ధి ప్రాజెక్టులను పట్టాలెక్కించడాన్ని పెద్ద సవాలుగా భావిస్తున్నాయి ప్రభుత్వాలు. ఎక్కడ చూసినా అభివృద్ధి పేరిట గుట్టల విధ్వంసం, పచ్చని చెట్లు నరికివేత, పంట పొలాల వినాశనం, అడవుల విధ్వంసం, విచ్చలవిడిగా కొనసాగుతుంది. 1952 జాతీయ అటవీ విధానం ప్రకారం దేశ భూభాగంలో 33 శాతం విస్తీర్ణంలో అడవులు కలిగి వుండాలి. కాని నేడు 24 శాతం మాత్రమే అడవులు ఉన్నాయి. ప్రకృతి విధ్వంసం ఇదే రీతిలో కొనసాగితే రానున్న కాలంలో మనిషి ఊపిరి తీసుకోవడానికి ప్రాణ వాయువు కూడా దొరకని దుర్భర పరిస్థితి ఏర్పడుతుంది. ప్రభుత్వాలు ఇప్పటికైనా సమతుల్య సాధనకు నడుం బిగించాలి. రియల్ ఎస్టేట్ వ్యాపారం, చెట్లను నరికివేత, పరిశ్రమల స్థాపన, అంతులేని అక్రమ మైనింగ్ వంటి చర్యలు అడవుల విధ్వంసానికి కారణమవుతున్నాయి.దాదాపుగా 2300 కి.మీ.లలో విస్తరించిన నల్లమల అడవి అంచున ఉన్న గ్రామం మైలారం. ఇది నాగర్‌కర్నూలు జిల్లా, బల్మూరు మండల కేంద్రంలోకి వస్తుంది. ఈ గ్రామం మైలారం గుట్టని ఆనుకొని వుంది. ఈ గుట్ట ఆ ప్రజలకు జీవనాధారం. ప్రాణవాయువును, కలపను సమృద్ధిగా అందిస్తుంది. అనేక ఫల వృక్షాలకు, ఔషధ మొక్కలకు, ఇతర వృక్ష జంతు జలవనరులకు ఈ గుట్ట ఆలవాలం. వేంకటేశ్వరస్వామి, చెన్నకేశవస్వామి, మారెమ్మతల్లి, ఈదమ్మ, శివుడు కొలువై వున్న ప్రశాంతమైన ప్రాంతం ఇది. జాతీయ పక్షి నెమలి, ఇతర పక్షులు, అనేక రకాల జంతువులతో అలరారుతుంటుంది. 120 ఎకరాల ఈ గుట్ట చుట్టూ ఆహ్లాదకరమైన చెరువులు, కుంటలు నిండుకుండల్కె మరింత శోభను తెచ్చిపెట్టాయి. కాకతీయుల కాలంనాటి సమాధులు, శివాలయం, పురాతన చరిత్రకు ఆధారాలుగా మిగిలాయి. ఈ గ్రామ స్త్రీలు ప్రకృతిలో భాగమైన ఈ గుట్టతో అనుసంధానం కలిగి ఉంటారు. 77 ఏళ్ళ స్వతంత్ర భారతంలో గిరిజన, బహుజన, దళిత, వ్యవసాయ మహిళా కూలీలకు ప్రాతఃకాలపు ఆత్మగౌరవ ప్రతీకగా ఈ గుట్ట నిలిచింది. ఈ గుట్ట అందించే ఔషధ మొక్కలతో ప్రాణాలను కాపాడుకోవడం, అది అందించే ఫలాలను తిని బ్రతకడం మాత్రమే వారికి తెలుసు. వారు ఈ గుట్టను తల్లిగా భావిస్తారు. కలలో కూడా ఈ గుట్టకు హాని తలపెట్టరు. అయితే ఈ గుట్టపై ఇటీవల ఓ పెట్టుబడిదారుడు రాబందులా వాలి తన ఇనుప గోళ్ళతో ఆ తల్లిలాంటి గుట్ట పొట్టను చీల్చుతున్నాడు. ఆ గుట్ట గర్భంలోని లేతవర్ణపు గోధుమ రంగు స్ఫటిక రాళ్ళ కుప్పను ఎత్తుకెళుతున్నారు. గ్రామస్థుల కడుపుకొట్టి విదేశాలకు ఎగుమతి చేస్తూ కోట్లకు పడగలెత్తుతున్నారు. గ్రామస్థులంతా ఒక్కట్కై గుట్ట తవ్వకాలను వ్యతిరేకిస్తున్నారు. ‘మైలారం గుట్ట పరిరక్షణ పోరాట కమిటీ’గా నిర్మాణమై గట్టిగా ప్రతిఘటిస్తున్నారు. గుట్టను ధ్వంసం చేసి అందులోని విలువైన ఖనిజాన్ని తరలిస్తున్న కాంట్రాక్టరు పోలీసులను దింపి హింసకు పాల్పడుతున్నాడు. గ్రామ యువకులను, పెద్దలను విచక్షణారహితంగా అరెస్టు చేసి అక్రమ కేసులు బనాయిస్తున్నారు. పోలీసులు పెట్టుబడిదారుల చేతిలో కీలుబొమ్మలయ్యారు. ఊరిలో పోలీసు క్యాంపు వెలసింది. మహిళలు, పిల్లలు, వ్యవసాయ కూలీలు భయభ్రాంతులకు గురవుతున్నారు. గుట్ట తవ్వకాలు తీవ్రమైన కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. భారీ వాహనాలు, లారీలు, జేసీబీలు, డ్రిల్లింగ్ మిషన్‌లు, తిరుగాడుతుండంతో రోడ్లు మట్టికొట్టుకుపోతున్నాయి. డ్రిల్లింగు మిషన్‌ల శబ్దాలకు చంటి పిల్లలు నిద్రలోనే ఉలిక్కిపడుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం నుండి తనకు అన్ని అనుమతులు ఉన్నాయని ధీమాగా వ్యవహరిస్తున్నాడు కాంట్రాక్టరు. ఆ అనుమతులన్నీ మోసపూరితంగానే తెచ్చుకున్నాడు. గుట్ట మైనింగును




నిలిపివేయాలని ప్రభుత్వ యంత్రాంగానికి అనేక విన్నపాలు సమర్పించుకున్నారు గ్రామస్థులు. అయినా ఎవరూ పట్టించుకోలేదు. నల్లమల రిజర్వు ఫారెస్టుకు అతి సమీపంలో ఉన్నా కూడా అటవీ అధికారులు దీనిని నిలువరించడం లేదు. చివరకు గ్రామస్థులే నడుం బిగించారు. తమ సమస్యలే ఆ ప్రజలను చైతన్యవంతుల్ని చేశాయి. అందులోంచి నాయకత్వాలు ఎదుగుతున్నాయి. ‘మైలారం గుట్ట పరిరక్షణ పోరాట కమిటికి’ యువకులు నాయకత్వం వహిస్తున్నారు. పెద్దలు సలహాలు సూచనలు అందజేస్తున్నారు. మరోవైపు న్యాయపోరాటానికి కూడా సిద్ధపడ్డారు. ఇంకోవైపు ప్రభుత్వం ఉద్యమాన్ని ఆదిలోనే అణచివేయాలని నిర్బంధాన్ని ప్రయోగిస్తూ అరెస్టులకు, రిమాండులకు పాల్పడుతున్నది. దామగుండం అటవీ ప్రాంతంలో నిర్మించ తలంచిన రాడార్ స్టేషన్ కింద నలిగిన ప్రజలు, లగచర్ల ఉద్యమంలో జైలుపాల్కైన రైతులు, ఇథనాల్ కంపెనీ వల్ల పచ్చని పొలాలు కోల్పోతున్న రైతులు, హైడ్రా జేసీబీల దాడి కింద చితికిపోయిన ప్రజలు, మూసీ పరీవాహక ప్రాంతంలోని నిర్వాసితులు ఈ ఉద్యమానికి సంఫీుభావంగా నిలవాలని కోరుతున్నారు. పర్యావరణవేత్తలు, శాస్త్రవేత్తలు, మేధావులు, రచయితలు, కవులు, కళాకారులు, ప్రజాసంఘాలు, పౌర సమాజం తమ న్యాయమైన పోరాటానికి అండగా నిలవాలని కోరుకుంటున్నారు.

– లక్ష్మణ్ గడ్డం
పౌరహక్కుల సంఘం అధ్యక్షులు

# ఆదివాసుల సమస్య అడవికే పరిమితమా?

రాష్ట్రంలో ఐటీ– ఎలక్ట్రానిక్స్ రంగాలకు మహర్దశ పట్టనున్నది. ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ రంగాలలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంతో దృఢమైన కార్యాచరణతో ఐటీ రంగం అభివృద్ధికి ఆ శాఖ మంత్రి నారా లోకేశ్ విశేష కృషి చేస్తున్నారు. శాస్త్ర సాంకేతికాంధ్రని దేశానికి దిక్సూచి చెయ్యాలన్న చంద్రబాబు స్వప్నాన్ని సాకారం చెయ్యడానికి శ్రమిస్తున్నారు. ఐటీ రంగాన్ని విస్తృతపరిచి యువతకి పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధికి పునాదులు వేస్తున్నారు. రానున్న ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పన దిశగా లోకేశ్ కృషి చేస్తున్నారు. రాష్ట్రానికి తరలివస్తున్న పరిశ్రమల అవసరాలను గుర్తించి అందుకు తగ్గట్టుగా యువతలో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు దేశంలోనే తొలిసారిగా స్కిల్‌సెన్సస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో యువతకు స్వయం ఉపాధి ఆధారిత నైపుణ్య కార్యక్రమాలను అమలు చేసి తద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఇటీవల సెంచూరియన్ యూనివర్సిటీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. దీనిద్వారా దుస్తుల తయారీ, ఆటో విడిభాగాలు, డ్రాగన్ ఫ్రూట్ సాగు, స్మార్ట్ వ్యవసాయం, డ్రోన్ టెక్నాలజీ వంటి రంగాల్లో ఎంటర్‌ప్రైజ్ క్లస్టర్‌లను ఏర్పాటు చేసి ఆయా రంగాల్లో వృత్తి నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. అగ్రిటెక్, ఏఐ అనుసంధానంతో రాష్ట్ర సాగు రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చి, ఉత్పాదకతను పెంచే సాగు విధానాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.ప్రగతిశీల ఆలోచనలతో ఆరు నెలలుగా రాష్ట్రంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాలను ప్రోత్సహిస్తూ నవశకానికి నవ్యాంధ్రను పరుగు తీయిస్తున్నారు లోకేశ్. రాష్ట్రాన్ని ఐటీ హబ్‌గా మార్చేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. అమరావతిని ఏఐ క్యాపిటల్‌గా తీర్చిదిద్దేందుకు, అంతర్జాతీయంగా వస్తున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా డీప్‌టెక్‌ను అభివృద్ధి చేసి తద్వారా యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో ఇన్నోవేషన్ యూనివర్సిటీ ఏర్పాటుకు ఫిజిక్స్ వాలాతో ఎంఓయు కుదుర్చుకున్నారు. ఆయన కృషి ఫలితంగా గూగుల్ క్లౌడ్, టీసీఎస్ వంటి దిగ్గజ కంపెనీలు రాష్ట్రంలో యూనిట్లను స్థాపించేందుకు ముందుకు వచ్చాయి. ఇప్పటికే ఐదువేల మందికి ఉపాధి కల్పిస్తున్న హెచ్‌సీఎల్ మరో 15 వేల ఉద్యోగాలు కల్పించేలా సంస్థను విస్తరించడానికి ముందుకు వచ్చింది. లోకేశ్‌తో చర్చల అనంతరం ఫాక్స్‌కాన్ సిటీ ఏర్పాటుకు ఆ సంస్థ ప్రణాళికలు రూపొందిస్తోంది.ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో ఐదేళ్లలో ఐదు లక్షలు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ప్రణాళిక సిద్ధం చేశారు. పెట్టుబడిదారుల స్నేహపూర్వక విధానాలతో నూతన ఐటీ, ఎలక్ట్రానిక్స్ పాలసీలను ప్రకటించారు. అత్యుత్తమ ప్రోత్సాహకాలతో 2024– 29లో ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్స్ తయారీ విధానం, ఆంధ్రప్రదేశ్ సెమీ కండక్టర్ డిస్‌ప్లే ఫ్యాబ్ పాలసీ, ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్ పాలసీ, ఆంధ్రప్రదేశ్ డేటా సెంటర్ పాలసీలను ప్రకటించారు.

సీఎం చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా సింపుల్ గవర్నమెంట్, ఎఫెక్టివ్ గవర్నెన్స్ కోసం విధానాల రూపకల్పన చేశారు. ఢిల్లీలో పారిశ్రామిక పెట్టుబడిదారులతో సమావేశాలను ఏర్పాటు చేసి రాష్ట్రంలో అమలుచేస్తున్న ప్రోత్సాహకాలతో కూడిన సులభతర విధానాలను వివరించారు.



శంషాబాద్, వాస్తవ తెలంగాణ న్యూస్: కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న ని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ ఆధ్వర్యంలో ఒక ప్రతినిధి బృందం కలిసి, శంషాబాద్ వరకు మెట్రో రైలు విస్తరణ చేయాలని, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వందే భారత్ రైలు హాల్టింగ్‌లను ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేసింది. ఈ సందర్భంగా బీజేవైఎం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మహేందర్ మాట్లాడుతూ, శంషాబాద్‌లో అంతర్జాతీయ విమానాశ్రయం, అంతర్జాతీయ రహదారి, ఓఆర్ఆర్ వంటి అత్యాధునిక సౌకర్యాలు ఉన్నందున, నిత్యం ప్రజల రాకపోకలు అధికంగా ఉంటున్నాయని. ప్రయాణికుల సౌలభ్యం కోసం మెట్రో రైలు శంషాబాద్ వరకు విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో వందే భారత్ రైలు హాల్టింగ్‌లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సహాయ మంత్రివర్యులు ఈ విషయంపై సానుకూలంగా స్పందించినట్లు మహేందర్ వెల్లడించారు.

## కుంగుతున్న కల్వర్టు పొంచి ఉన్న ప్రమాదం

**– తీవ్ర ఇబ్బంది పడుతున్న వాహనదారులు**



చౌటకూర్ //వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి: కొద్ది రోజులుగా చౌటకుర్ మండల్ పరిధిలోని తాడ్ దాన్ పల్లి సింధూర వెంచర్ వద్ద ఆర్ అండ్ బి రోడ్డుపై ఉన్న కల్వర్టు కుంగిపోయింది ఫలితంగా వాహనదారులు భయపడుతూ కల్వర్టు దాటాల్సిన పరిస్థితి నెలకొంది పుల్కల్ మండల్ కు రోజు ఎమ్మార్వో ఎంపీడీవో మండల అధికారులు అందరూ ఇలానే వెళ్తారు వాళ్లకు కనబడడం లేదా సింగూర్ ప్రాజెక్ట్ పర్యాటక కేంద్రానికి కూడా ఎన్నో కార్లు హైదరాబాద్ నుండి వస్తూ ఉంటారు కల్వర్టు వలన టు వీలర్ వాళ్లయితే కల్వర్టు రాగానే స్లో చేయకుంటే వెనకాల కూర్చున్న వాళ్లు పడిపోవడం జరుగుతుందని వాహనాల ఎక్సెల్ కమాన్ పట్టీలు డ్యామేజ్ అవుతున్నాయని ఇప్పటికైనా సంబంధిత అధికారులు కల్వర్టు బాగు చేయాలని వాహనదారులు అంటున్నారు

## కాంగ్రెస్ పార్టీ లో చేరిన బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు....



తూప్రాన్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి నవీన్ : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నేతృత్వంలో చేస్తున్న అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి తెలిపారు తూప్రాన్ పురపాలక సంఘ పరిధిలో 2వ వార్డు బుడగ జంగాల కాలనీ నుండి, భారీగా బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు నాయకులు మున్సిపల్ మామి%శీ%డ్ల జ్యోతి కృష్ణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధికి ముగ్ధులై గజ్వేల్ మాజీ శాసనసభ్యులు సిద్దిపేట జిల్లా డిసిసి అధ్యక్షులు, తూముకుంట నర్సారెడ్డి సమక్షంలో, మున్సిపల్ చైర్పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలను కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు కాంగ్రెస్ పార్టీకి చేరిన వారికి తాను అండగా ఉంటానని వారికి ఏ సహాయం కావాలన్నా తాను చేస్తానని తెలిపారు పార్టీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఒక్కరికి తెలియజేయాలని కోరారు కాంగ్రెస్ పార్టీలో చంద్రం , నర్సింలు ,సత్యం , వెంకటయ్య, నరేందర్,రమేష్, యాదగిరి, వసంత్ , రాజు, సంజీవ్, ఆంజనేయులు , అజయ్ శంకర్, రవి, సత్యనారాయణ ముఖ్య నాయకులు చేరారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దామోదర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## కాంగ్రెస్ క్యాలెండర్ ఆవిష్కరించిన : మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి



తూప్రాన్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి నవీన్ : వచ్చే స్థానిక ఎన్నికలలో పార్టీని మరింత బలోపేతం చేయాలని అన్ని స్థానాలు గెలవడానికి కార్యకర్తలు సైనికులుగా పని చేయాలని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి తెలిపారు తూప్రాన్ మున్సిపల్ పరిధిలో గల 10వ వార్డు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీకాంత్ రెడ్డి ముద్రించిన2025 నూతన సంవత్సర కాంగ్రెస్ పార్టీ కి సంబంధించిన క్యాలెండర్ ను ఆయన ఆవిష్కరించారు ప్రతి ఇంటికి ఒకటి చొప్పున క్యాలెండర్ పంపిణీ చేయాలని క్యాలెండర్ వల్ల తిథి వార నక్షత్రాలు తోపాటు కాంగ్రెస్ పార్టీ చేస్తున కార్యక్రమాలు వారికి క్యాలెండర్ ను చూసినప్పుడల్లా గుర్తుకు వస్తాయని తెలిపారు ఈ కార్యక్రమంలో నాయకులు మామి%శీ%డ్ల కృష్ణ' సిద్ధిరాములు గౌడ్' పెంట గౌడ్ జింక మల్లేశం, ఆఫ్సర్, దామోదర్ రెడ్డి ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ప్రజావాణి దరఖాస్తులపై అలసత్వం తగదు

**– జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్ ప్రతినిధి (ఆంజనేయులు) ప్రజావాణికి వచ్చే దరఖాస్తులపై అలసత్వం తగదని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు.సోమవారం, జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో లిఅదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ భుజంగరావు,జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాసరావు, సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ లి వివిధ సమస్యలతో వచ్చే ప్రజల నుంచి ప్రజావాణి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా (61) ఆర్జీలను కలెక్టర్ స్వీకరించారు. పింఛన్ల కొరకు–03, భూ సమస్యల– 20, ఇందిరమ్మ ఇండ్ల కొరకు–11, ఇతర సమస్యలు–27 ఉన్నాయన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన విజ్ఞప్తుల పరిష్కారం దిశగా అత్యంత ప్రాధాన్యతతో ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు అందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అదే విధంగా అర్జీలు పెండింగ్ లో లేకుండా త్వరితగతిన పరిష్కరించి, పూర్తిచేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి, పరిష్కరించాలని ఆదేశించారు. ఎటువంటి నిర్లక్ష్యం వహించరాదని, అలాగే మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రతి సోమవారం తప్పనిసరిగా నిర్వహించాలని, అందుకు తగ్గట్లుగా ప్రచారం చేపట్టాలని ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో యూనస్, ఇతర శాఖల జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## సంగారెడ్డి జిల్లా ప్రజావాణిలో 85 దరఖాస్తులు.



సంగారెడ్డి వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి టీ మాణిక్యం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ వల్లూరు క్రాంతి ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 85 మంది సమస్యలు విన్నవించారు సమస్యలు వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసిన ప్రజావాణిలో పనులు అవడం లేదని వచ్చినటువంటి ప్రజావాణిలో వ్యాధులు చేసిన ప్రజలు వినతి పత్రాలు ఇచ్చి కలెక్టర్ గారికి తెలిపారు. అలాంటప్పుడు తగిన చర్యలు చేపట్టే విధంగా అందరి అధికారులకు వెంటనే పరిష్కారం చేయాలని తెలుపుతున్నానని ఆమె చెప్పడం జరిగినది. ఇలా చెప్పడం సంవత్సరం గడుస్తున్నా నా ఒక్క ఫిర్యాదు మాత్రం కావడం లేదని ఒక రైతు సోమవారం ప్రజావాణిలో మండిగా ప్రవర్తించారు. మీ యొక్క సమస్యను అతి త్వరలో పరిష్కరిస్తామని కలెక్టర్ గారు మచ్చ చెప్పి పంపించడంతో సదుమనింది. ఇలాంటి అప్పుడు ప్రజావాణిని పెట్టుడెందుకు ఫిర్యాదులు తీసుకోవడం ఎందుకు ప్రజలు రావడం ఎందుకని ప్రజలు దుర్భాషలాడారు. ఇచ్చిన వెంటనే ప్రజావాణిలో ప్రతి ఒక్క సమస్యను పరిష్కారం అయిద్దా లేదా అని ఉన్న 85 ఫిర్యాదులు కలెక్టరేట్లో చాలామంది ఆఫీసర్లు ఉన్నారు ఏ ఆఫీసర్ తో అయినా చీపియవచ్చును ఉన్న ఆఫీసర్లనే ఉన్నారు కానీ ఏపీ రాదు కావడం లేదని ప్రజలు వాపోయారు.

అందరు ఆఫీసర్లు కలెక్టర్లు మంత్రులు మొత్తం అంతా ఒకటే పేదలను దోచుక తింటున్నారని ప్రజావాణి ప్రజలు కూడా ఒక రైతు ఇచ్చినటువంటి ఫిర్యాదు ఉన్నదని వారు తెలిపారు. ఇలా మండిగా ప్రవర్తించకండి నేను సమస్యలు పరికార్యిస్తాను అని కలెక్టర్ గారు వారికి నచ్చజెప్పి తోలించడం జరిగినది.

## కెసిఆర్ ను కలిసి ఆశీర్వాదాలు తీసుకున్న పద్మ దేవేందర్ రెడ్డి

వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్ ప్రతినిధి (ఆంజనేయులు) మెదక్ మాజీ ఎమ్మెల్యే, జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి పద్మ దేవేందర్ రెడ్డి గారి జన్మదిన వేడుకలు సోమవారం పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. నియోజవర్గంలోని వివిధ మండలాలకు చెందిన పార్టీ నాయకులు పద్మాదేవేందర్ రెడ్డి గారిని హైదరాబాదులో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పద్మా దేవేందర్ గారు కుటుంబ సభ్యులతో కలిసి గౌరవ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ గారి ఫామ్ హౌస్ కి వెళ్లారు. ఈ సందర్భంగా కెసిఆర్ గారికి పుష్పగుచ్ఛం అందజేసి ఆశీర్వాదం తీసుకున్నారు.



పద్మాదేవేందర్ రెడ్డి గారికి కెసిఆర్ గారు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## కంది లో ఘనంగా ఎల్లమ్మ బోనాల వేడుకలు.



సంగారెడ్డి జిల్లా కంది మండలం మామిడిపల్లి గ్రామంలోని రేణుక ఎల్లమ్మ బోనాల వేడుక సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు తలపై బోనాలను ధరించి గ్రామ పురవీధుల మీదుగా ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించారు అలాగే పోతురాజుల విన్యాసాలతో ప్రత్యేకంగా ఆకట్టుకున్న అటువంటి విన్యాసాలను ప్రతి ఊరి నుంచి వచ్చినటువంటి ప్రజలకు ఆ యొక్క విన్యాసాలు ఆకట్టుకున్నాయి రేణుక ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చినటువంటి ఎల్లమ్మ బోనాలకు వేడుకలు ఘనంగా నిర్వహించడంతో అందరూ సంతోషాలతో ఉండాలని గ్రామ పురవీధులు అన్ని సుఖశాంతులతో ప్రజలందరూ ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్టు వారు తెలిపారు. గ్రామంలో ప్రజలందరినీ మంచిగా చూసుకోవాలని ఎల్లమ్మ తల్లికి అందరూ బోనాలు నింపి బోనాల మధ్య విన్యాసాలతో పోతురాజులు ఘనంగా అమ్మవారికి సమర్పించి ప్రజలందరూ మంచిగా ఉండాలని కోరుకున్నారు.

## పిర్యాదిదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించిన ..

**– ఎస్.పి. డి.ఉదయ్ కుమార్ రెడ్డి .**



వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్ ప్రతినిధి (ఆంజనేయులు) మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్.పి. డి.ఉదయ్ కుమార్ రెడ్డి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు పలు సూచనలు చేయడమైనది. సోమవారం నాడు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్ ల యొక్క ఎస్ఐ మరియు సిఐ లకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని మరియు పరిష్కారానికి సూచనలు చేయడం జరిగింది.ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసుసేవల్నివినియోగించుకుంటూ, వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకొనేల, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని జిల్లా ఎస్.పి.డి.ఉదయ్ కుమార్ రెడ్డి .తెలియజేశారు. ప్రజా సమస్యలు పై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారిస్తున్నాము అని తెలియజేశారు.

## కీసర గుట్ట చైర్మన్ ప్రమాణ స్వీకారం లో ఎంఎల్ఏ, మల్లరెడ్డి, మాజీ ఎంఎల్ఏ సుదీర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తోటకురా జంగయ్య యాదవ్,



మేడ్చల్ నియోజకవర్గం కీసర మండల కేంద్రంలోని కీసర గుట్ట శ్రీ భవాని రామలిగేశ్వర స్వామి ఆలయ చైర్మన్ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమంలో ఎంఎల్ఏ మాజీ మంత్రి మల్లారెడ్డి, మాజీ ఎం ఎల్ ఏ సుదీర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తోట కురా జంగయ్య యాదవ్ పాల్గొనడం జరిగింది. చైర్మన్ గా ప్రమాణస్వీకారం చేసినా తాటకం నారాయణ శర్మ కి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఆలయంలో శ్రీ రామలింగేశ్వర స్వామిని దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగారం మాజీ వర్డ్ సభ్యులు సాయినాథ్ గౌడ్ కీసర గుట్ట నుతాన చైర్మన్ ప్రమాణ స్వీకారం చేసిన తటాకం నారాయణ శర్మ కూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో నాగారం మున్సిపల్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు తేళ్ల శ్రీధర్ ,చిన్నంరాజు సాయినాథ్ గౌడ్, టీఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ విగ్నేష్ ,యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ సంపత్ కుమార్ నాయి తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సేవలాల్ జయంతి రోజు సెలవు ప్రకటించాలి.



సంగారెడ్డి వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి టీ మాణిక్యం...... సంత సేవాలాల్ మహారాజు జయంతి రోజు జనరల్ హాలిడే ప్రకటించాలని సంగారెడ్డి జిల్లా బంజారా నాయకులు, గోరు సేన నాయకులు సోమవారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతిని కోరారు. వచ్చే నెల ఫిబ్రవరి 15 సేవాలాల్ మహారాజ్ జయంతి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్కూల్లకు కార్యాలయాలకు సెలవు ఇవ్వాలని కోరుతూ కలెక్టర్కు వినతిపత్రం ఇచ్చారు. ఇందులో నారాయణఖేడ్ గోర్ సేన అధ్యక్షులు బంగారు రాజు ఉన్నారు అలాగే సంగారెడ్డి సేవాలాల్ అధ్యక్షులు అందరూ పాల్గొని కలెక్టర్ గారికి వినతి పత్రం ఇచ్చారు. ప్రతి మతాలవారికి పండగలు ఉంటాయి సెలవులు ఇస్తారు కానీ మా యొక్క సేవాలాల్ జయంతికి మాత్రం కంపల్సరీ సెలవు రోజు ప్రకటించాలని ఆమెను కోరారు.

## కీసర గుట్ట నూతాన చైర్మన్ తటాకం నారాయణ శర్మ కి శుభాకాంక్షలు తెలిపినా చద్రారెడ్డి...



కీసర మండల వాస్తవ తెలంగాణ న్యూస్ మేడ్చల్ జిల్లా నాగారం మున్సిపాలిటీ కీసరగుట్ట శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్ గా ప్రమాణస్వీకారం చేసిన తటాకం నారాయణ శర్మ కి నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి హార్తిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్ శ్రీనివాస్ రెడ్డి, కృష్ణవేణి నాయకులు పాల్గొన్నారు.

## పాడి రైతులకు అధిక పాల ఉత్పత్తుల పోటీలు.



సంగారెడ్డి వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి టీ మాణిక్యం.... సంగారెడ్డి పట్టణంలోని గొల్లగూడెం లో అధిక పాల దిగుబడి ఇచ్చే గేదెలపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన గేదెల యజమానులకు బహుమతులు అందజేశారు. సోమవారం జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక కౌన్సిలర్ లాడే మనీలా మల్లేశం మొదటి, రెండవ, మూడవ బహుమతులను అందజేశారు. ఇలాంటి అప్పుడు పాడి గేదలను పెంచుకోవడం గేదలు పాలు ఎక్కువ ఇచ్చేలా వాటిని పెంచడం బాగుంటుందని పశుసంవర్ధక శాఖ వారు తెలిపారు. పాడి గేదెలను పెంచుకుంటే రోజు పైసలే వస్తాయని ఆయన సూచించారు సోమవారం జరిగినటువంటి కార్యక్రమానికి గేదెల యజమానులకు జిల్లా పశు సంవర్ధక శాఖ వారు అందరికీ పాల ఉత్పత్తి పెంచడంలో మనం నైపుణ్యం పెంచుకోవాలని అలాంటప్పుడు ఒక లీటర్ పాలు పెరిగిన ఒక వంద రూపాయలు పెరిగినట్టు అని ఆయన తెలిపారు రోజువందంటే నేలకు 3000 అవుతాయని ఆయన తెలిపారు. పట్టణాల్లోనూ కూడా పాడు గేదెలను పోషించుకోవడం మంచి అభినందనీయమని వారు తెలిపారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కౌన్సిలర్ హాజరు కావడం మనీలా తెలపడం సంతోషకరమని వారు తెలిపారు.

## కీసర గుట్ట ఆలయ నూతన చైర్మన్ తటాకం నారాయణ శర్మ కి నాగారం పలువురు నాయకుల శుభాకాంక్షలు



కీసర మండల వాస్తవ తెలంగాణ న్యూస్/ మేడ్చల్ జిల్లా నాగారం మున్సిపాలిటీ లో నీ పలువురు నాయకులు కీసర గుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ నూతన చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసినా తటాకం నారాయణ శర్మ కి హార్థిక శుభాకాంక్షలు తెలిపారు.

## విస్తరిస్తున్న లేటెస్ట్ టెక్నాలజీ మల్టీప్లెక్స్ థియేటర్స్

ఎంటర్టైన్ మెంట్ రంగంలో ప్రతిష్టాత్మకమైన సంస్థలు సైతం ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రధాన నగరాల్లో తమ కార్యకలాపాలు విస్తరిస్తున్నాయి. వీటికి ప్రజల నుంచి ఆదరణ లబిస్తుండటంతో అటు ఉత్తరాంధ్ర నుంచి కోస్తాంధ్ర వరకు కోస్తా ఆంధ్ర నుంచి రాయలసీమ వరకు మల్టీప్లెక్స్‌లు విస్తరించాయి. ఒకప్పుడు సినిమా పేరు వినగానే ఏపీలోని విజయవాడ నగరం గుర్తుకు వచ్చేది. ఎన్టీఆర్ నుంచి ఎఎన్నార్ వరకు ఏ సినిమా విడుదల అయినా తొలి ఆట విజయవాడలో ఆడల్సిందే. ఉమ్మడి రాష్ట్రంలో రాజధానిగా హైదరాబాద్ ఉన్నప్పటికీ సినిమా కేంద్రంగా బెజవాడే ఉండేది. అందుకే ఉమ్మడి రాష్ట్రంలో ఎక్కడాలేనన్ని థియేటర్లు ఇక్కడా వెలిశాయి. బడాబడా రాజకీయ నేతలు సైతం ఇక్కడ సినిమా హాళ్లు నిర్మించి ఆదాయం ఆర్జించారు. అయితే మారుతున్న కాలంతో పాటు టెక్నాలజీ మారింది. అందులో భాగంగానే ఈ మార్పును అనుకున్న స్థాయిలో అందిపుచ్చుకోక పోవడంతో విజయవాడతో పాటు వెండితెర వైభవం ఏపిలో తగ్గుతూ తగ్గుతూ వచ్చింది. ఇదే సమయంలో హైదరాబాద్ వంటి మెట్రో నగరాలు, సిని నిర్మాణ ప్రదేశాల్లో లేటెస్ట్ టెక్నాలజీతో థియేటర్లు వెలియడంతో ప్రేక్షకులు వీటికి అలవాటు పడ్డారు. దీంతో కార్పోరేట్ సంస్థలు ఈ రంగంలోకి ప్రవేశించి ప్రేక్షకుల అభిరుచికి అనుగుణంగా థియేటర్లు నిర్మించి అభిమానాన్ని చూరగొన్నాయి. దీంతో ఏపీలోని ఇతర నగరాల్లోని థియేటర్ల యజమానులు కూడా తమ ఆలోచనలు మార్చుకుని మల్టీప్లెక్స్ థియేటర్ల నిర్మాణానికి ఆసక్తి ఇప్పుడు చూపుతున్నారు. వీటి నిర్మాణం నిర్వహణ విషయంలో ఖర్చు ఎక్కువగా ఉన్నా ప్రేక్షకుల మద్ధతు ఉండటంతో రాజీపడకుండా సౌకర్యాలు కల్పిస్తున్నారు.

https://epaper.vasthavatelangana.com
మంగళవారం, 06 జనవరి, 2025

# దేశంలో ఒకే రోజు మూడు హెచ్ఎంపీవీ కేసులు



చైనాలో వెలుగు చూసిన హ్యూమన్ మెటానిమోవైరస్ – హెచ్ఎంపీవీ వైరస్ అనుకున్న దాని కంటే వేగంగానే ప్రపంచ దేశాలకు విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలోనే సోమవారం భారత్‌లో తొలి కేసు గుర్తించగా.. ఇవాళే ఇప్పటివరకు మొత్తం 3 కేసులు నమోదు అయ్యాయి. ఇందులో రెండు కర్ణాటక రాజధాని బెంగళూరులో కాగా.. మరో కేసు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో గుర్తించారు. ఈ మేరకు ఐసీఎంఆర్ వెల్లడించింది. ఇప్పటికే బెంగళూరులో 3, 8 నెలల వయసు కలిగిన ఇద్దరు చిన్నారులకు ఈ హెచ్ఎంపీవీ వైరస్ పాజిటివ్‌గా తేలగా.. అహ్మదాబాద్‌లో 2 నెలల చిన్నారికి ఈ వైరస్ సోకినట్లు నిర్ధారించింది. ఈ క్రమంలోనే దేశవ్యాప్తంగా శ్వాసకోశ వ్యాధుల విషయంలో ఐసీఎంఆర్ సాధారణ పర్యవేక్షణలో భాగంగా ఈ రెండు కేసులు వెలుగు చూశాయని కేంద్ర ఆరోగ్యశాఖ తాజాగా వెల్లడించింది. భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో ఈ హెచ్ఎంపీవీ వైరస్ వ్యాప్తి చెందుతోందని తెలిపింది. ఈ హెచ్ఎంపీవీ వైరస్ కేసులు చైనాను దాటేసి ఇతర దేశాల్లోనూ ఇప్పుడు కేసులు నమోదు అవుతున్నాయని స్పష్టం చేసింది.బెంగళూరులోని 3 నెలల చిన్నారికి ఈ హెచ్ఎంపీవీ వైరస్ సోకగా.. దాని నుంచి కోలుకుందని పేర్కొంది. ఆ చిన్నారి ఆస్పత్రి నుంచి డిశ్చార్జి కాగా.. మరో చిన్నారి చికిత్స పొందుతోందని తెలిపింది. ప్రస్తుతం అహ్మదాబాద్‌లో వైరస్ సోకిన చిన్నారికి చికిత్స అందిస్తున్నామని వెల్లడించింది. అయితే ఈ హెచ్ఎంపీవీ వైరస్ వెలుగు చూసిన దేశాల్లో.. ప్రస్తుతం ఆ వైరస్ సోకిన చిన్నారుల కుటుంబ సభ్యులు ఎలాంటి ప్రయాణాలు చేయలేదని కేంద్ర ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది.ఇక చైనాలో ప్రారంభమై.. ఇతర దేశాలకు విస్తరించి.. చివరికి భారత్‌లోనూ ఈ హెచ్ఎంపీవీ వైరస్ కేసులు నమోదు అవుతుండటం పట్ల కేంద్రం స్పందించింది. ఈ వైరస్ వ్యాప్తి పట్ల దేశంలోని అన్ని రాష్ట్రాలు నిరంతరం అలర్ట్‌గా ఉండాలని సూచించింది. ఈ హెచ్ఎంపీవీ వైరస్ లక్షణాలతో వచ్చిన రోగులకు మెరుగైన చికిత్స అందించాలని పేర్కొంది. ఇందు కోసం అన్ని రాష్ట్రాల్లోని ఆస్పత్రుల్లో తగిన సదుపాయాలు, మౌలిక వసతులు సమకూర్చుకోవాలని తెలిపింది.ఇక ఈ వైరస్ లక్షణాలు కూడా ఫ్లూ, ఇతర శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల లాగే ఉంటాయని డాక్టర్లు చెబుతున్నారు. దగ్గు, జ్వరం, ముక్కు దిబ్బడ, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటుందని పేర్కొన్నారు. ఇక ఈ హెచ్ఎంపీవీ వైరస్ అధికంగా ఉన్నవారిలో బ్రాంకైటిస్, నిమోనియా లాంటి వ్యాధులు వస్తాయని తెలిపారు. ఈ హెచ్ఎంపీవీ వైరస్ లక్షణాలు బయటికి కనిపించడానికి 3 నుంచి 6 రోజులు పడుతుందని చెప్పారు. ఇక అమెరికాకు చెందిన సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ తెలిపిన ప్రకారం.. చిన్నారులు, వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారికి ఈ హెచ్ఎంపీవీ వైరస్ వచ్చే అవకాశాలు ఎక్కువ అని పేర్కొంది. ఇక చైనాలో వెలుగుచూసిన ఈ హ్యూమన్ మెటానిమోవైరస్ వ్యాప్తి నేపథ్యంలో ఇప్పటికే అప్రమత్తమైన భారత్.. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ జాయింట్ మానిటరింగ్ గ్రూప్ సమావేశం నిర్వహించింది. అయితే భారత్‌లో అంత ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొంది.

# హైదరాబాద్‌లో మంత్రిగారి మంత్రాంగం!

(అమరావతి): ఆయన తొలిసారి మంత్రి.. బాగా కీలకమైన పదవి. ఈ పదవిని ఆయనకు కట్టబెట్టినప్పుడే పొరుగురాష్ట్రం తెలంగాణతోపాటు, ఏపీలోనూ చర్చోపచర్చలు సాగాయి. "ఈయనకు ఆ పోర్టుఫోలియో (శాఖ) ఇచ్చారా? చంద్రబాబుకు అన్నీ తెలిసే నిర్ణయం తీసుకున్నారా? ఆయన ఇక్కడ ఏం పనులు చేస్తారో తెలిసే ఆయన్ను కేబినెట్‌లోకి తీసుకున్నారా?" అని తెలంగాణలోని ప్రభుత్వ పెద్దలు, రాజకీయవర్గాల్లో చర్చలు జరిగాయి. ఆ తర్వాత ఇవే చర్చలు చంద్రబాబుకు చే రాయి. కానీ, అప్పటికే ఆయనకు పదవి ఇచ్చేయడంతో చంద్రబాబు ఏమీచేయలేని పరిస్థితి. ఫిర్యాదులున్నాయి...పనితీరులో మంచి ఫలితాలతో ముందడుగు వేయాలని బాబు సూచన చేసినట్లు తెలిసింది.అధినే త సూచనను ఆ చెవితో విని, ఈ చెవితో వదిలేసినట్లుంది ఆ 'డార్లింగ్ మంత్రి'. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. వారంలో రెండు రోజులు నియోజకవర్గం.. రెండు రోజులు అమరావతి, మరో మూడు రోజులు హైదరాబాద్‌లో మకాం... ఇదీ సదరు మంత్రి షెడ్యూల్. శుక్ర వారం నుంచే ఆ మంత్రి హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ స్టార్ హోటల్‌లో దిగిపోతారు. మంత్రికి ఆల్ ఇన్‌వన్‌గా ఒకరున్నారు. ఆయన షాడో మంత్రిగా వ్యవహరిస్తున్నారు. ఫైళ్లమీద సంతకాలు పెట్టరుకానీ, మిగిలిన వ్యవహారాలన్నీ ఆయనే చక్కదిద్దుతారు. శుక్రవారం వచ్చిందంటే చాలు మంత్రి, ఆయన ఆల్ ఇన్‌వన్, మరో ఇద్దరు కలిసి హైదరాబాద్‌లో తేలతారు. ఓ ప్రముఖ స్టార్‌హోటల్‌లో బస చేస్తారు. నాలుగు రూమ్‌లు బుక్ చేస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆ మంత్రితో పనులున్నవారు, కీలక వ్యవహారాలు చక్కబె ట్టుకోవాల్సినవారు ఆ హోటల్‌లో బారులు తీరతారు. ఇప్పుడిప్పుడు తెలంగాణలోని భూ వ్యవహారాల్లోనూ వేలు పెడుతున్నట్టు చెబుతున్నారు. ఏమైనా.. ఇదంతా ఆ మూడు రోజులు పెద్ద జాతరలా సాగుతుంది. ఒక రూమ్‌లో పంచాయతీలు, పరిష్కారాలు, సెటిల్‌మెంట్లు. ఇవన్నీ మంత్రి ఆల్ ఇన్‌వన్ చూస్తుంటారు. మరో రూమ్‌లో మంత్రి దర్జాగా విలాసాన్ని ప్రదర్శిస్తుంటారు. శనివారం మధ్యాహ్నం వరకే విజిటర్స్, సెటిల్‌మెంట్ కోసం వచ్చినవారిని అనుమతిస్తుంటారు. సాయంత్రం నుంచి ఆదివారం అర్ధరాత్రి వరకు గానాబజానా.. కళా ప్రదర్శనలతో హోరెత్తిస్తుంటారు. నిజానికి మంత్రి కాకముందే, ఓ సాధారణ ఎమ్మెల్యేగా ఉన్నసమయంలో ఇదే జోరుండేది. మంత్రి అయ్యాక బుక్‌చేసే గదుల సంఖ్య పెరిగింది. ఆయన కోసం వచ్చే సందర్శకులు అదనం. హైదరాబాద్‌లో ఆ మంత్రికి రియల్ ఎస్టేట్, ఇతర వ్యాపార సంబంధాలున్నాయి. అదే సమయంలో ఏపీలోనూ పలు వ్యాపారా ఉలున్నాయి. ఆయన హైదరాబాద్‌లో కాలుపెట్టారంటే బ్యాచ్‌కు పండగే. ఇది రానురాను ఓ పెద్ద అంశంగా మారిపోయింది. తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా ఈయనపై దృష్టి పెట్టేంతగా వెళ్లింది. అంతకుముందు ఆయన హోటల్‌లో దిగితే ఏం చేస్తారో తెలుసు. కానీ ఏపీలో మంత్రి అయ్యాక, హైదరాబాద్ కేంద్రంగా ఏం చేస్తున్నారో తెలుసుకునేందుకు ప్రత్యేకంగా దృష్టి సారించారు. గత ఆరు నెలలుగా ఆ మంత్రి, ఆయన ఆల్ ఇన్‌వన్ ఎక్కడా తగ్గకుండా వీకెండ్ జోరుతోపాటు హైదరాబాద్ కేంద్రంగా వ్యవహారాలు అనేకం చక్కబె డుతున్న సమాచారం అక్కడి ప్రభుత్వ పెద్దలకు పక్కా ఆధారాలతో సహా చేరింది. దీంతో మరో అడుగు ముందుకేసి పూర్తిస్థాయి నిఘాపెట్టారు. అప్పుడే విస్మయం గొలిపే అంశాలు వారి దృష్టికి వెళ్లాయి. ఇక లాభం లేదనుకొని ఇటీవల సీఎం చంద్రబాబుకు తెలంగాణ ప్రభుత్వం ఓ లిఖితపూర్వక సమాచారం అందించింది. దాంతోపాటు మౌఖిక సూచనలతో ఒక కాల్ వచ్చినట్లు తెలిసింది. ఆ మంత్రి సాధారణ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఏం చేశారు? మంత్రి అయ్యాక ఏం చేస్తున్నారనేది ఆ నోట్‌లో సవివరంగా పేర్కొన్నట్లు తెలిసింది. "మీ మంత్రిని జర చూసుకోండి. ఆయన ఇక్కడ చేస్తున్న పనులేవీ బాగోలేవు. తెలంగాణ భూముల వ్యవహారాల్లో వేలు పెడుతున్నారు. సెటిల్‌మెంట్లకు కౌంటర్ తెరిచారు. మీరు కంట్రోల్‌లో పెట్టుకోండి. అ పనులేవో అక్కడే (ఏపీలో) చేసుకోమనండి" అని సూటిగా, స్పష్టంగా చంద్రబాబుకు సూచన చేసినట్లు తెలిసింది. ఆ తర్వాత ఆ మంత్రి లీలలు, పనితీరుపై చంద్రబాబు పూర్తి నివేదిక తెప్పించుకున్నారని తెలిసింది. ఈ సందర్భంగా ఆ మంత్రి పేషీలో ఆల్‌ఇన్‌వన్ చేస్తున్న పనులు వెలుగుచూశాయి. మంత్రికి సన్నిహితుడు, వ్యాపార భాగస్వామిగా ఉన్న వ్యక్తే ఆ శాఖకు ఆల్ ఇన్‌వన్‌గా వ్యవహరిస్తున్నారని బయటకొచ్చింది. మంత్రికి వచ్చే కీలకమైన ఫైళ్లు, మంత్రి కోర్టు పరిధిలోని అంశాల్లో ఆయన వేలుపెట్టడం, ఇంకా ఏ నిర్ణయాలు తీసుకోవాల్నో దిశానిర్దేశం చేస్తున్నారని గుర్తించారు.విజయవాడ గురునానక్ కాలనీలో మంత్రికి ప్రైవేటు నివాసం ఉంది. దానికి కూతవేటు దూరంలో ఓ స్టార్ హోటల్ ఉంది. అక్కడ మంత్రి పరివారం చేసే కార్యక్రమాలు వేరే లెవల్ అని ప్రభుత్వం గుర్తించింది. అటు తెలంగాణ ప్రభుత్వం, ఇటు ఏపీ ప్రభుత్వ సొంత నివేదికలు ఆ డార్లింగ్ మంత్రిని పక్కాగా బుక్‌చేశాయి. మరి ప్రభుత్వాధినేత చంద్రబాబు ఎలా స్పందించనున్నారన్నది సహచర మంత్రులు, అధికారుల్లో చర్చనీయాంశంగా మారింది.

## రెండో అతి పెద్ద ఫ్లైఓవర్ ప్రారంభం



హైదరాబాద్: ఆరాంఘర్– జూ పార్క్ ఫ్లైఓవర్ ను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. రూ.799 కోట్ల జీహెచ్ఎంసీ నిధులతో ఆరాంఘర్ చౌరస్తా నుంచి జూపార్క్ వరకూ 6 లైన్ల ఫ్లైఓవర్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్మించింది. 4.08 కిలోమీటర్ల పొడువు, 23 మీటర్ల వెడల్పుతో అధికారులు దీన్ని నిర్మించారు. నగరంలో పీవీ ఎక్స్‌ప్రెస్ ఫ్లైఓవర్ తర్వాత ఇదే రెండో అతి పెద్ద ఫ్లైఓవర్. కాగా, ఇవాళ (సోమవారం) మధ్యాహ్నం సీఎం రేవంత్ రెడ్డి.. మంత్రులు, అధికారులతో కలిసి దీన్ని ఘనంగా ప్రారంభించారు. ఫ్లై ఓవర్ ప్రారంభం కావడంతో నగరంలో ట్రాఫిక్ కష్టాల నుంచి ప్రజలకు ఉపశమనం లభించనుంది. ఆరాంఘర్ ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే బెంగళూరు హైవే నుంచి హైదరాబాద్ నగరంలోకి ట్రాఫిక్ అంతరాయం లేకుండా తేలికగా ప్రవేశించవచ్చు. అలాగే ఎంజీబీఎస్ బహదూర్‌పుర నుంచి ఎయిర్‌పోర్ట్, బెంగళూరు హైవేకు ఈజీగా వెళ్లొచ్చు. తాడ్ బన్ జంక్షన్, దానమ్మ హాట్స్, శాస్త్రీపురం, హసన్ నగర్, శివరాంపల్లి జంక్షన్ల వద్ద ట్రాఫిక్ చిక్కులు లేకుండా ఫ్లైఓవర్ పైనుంచి నగర వాసులు సులభంగా ప్రయాణించవచ్చు. ఎస్ఆర్డీపీ కింద నిర్మిస్తున్న 42 ప్రాజెక్టుల్లో ఇప్పటివరకూ 36 ఫ్లైఓవర్లు, అండర్ పాసులు అందుబాటులోకి వచ్చాయి. కాగా, 37వ ప్రాజెక్టుగా ఆరాంఘర్–జూ పార్క్ ఫ్లైఓవర్ తాజాగా అందుబాటులోకి వచ్చింది.

# ప్రధాని పదవికి రాజీనామా చేస్తానంటూ ట్రూడో ప్రకటన

- సొంత పార్టీలోనే తీవ్ర వ్యతిరేకత
- ట్రూడోపై పెరిగిన ఒత్తిడి
- కొత్త నాయకత్వాన్ని ఎన్నుకోగానే రాజీనామా చేస్తానని వెల్లడి
- అప్పటివరకు పదవిలో కొనసాగుతానన్న ట్రూడో




గత కొన్నాళ్లుగా తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటున్న కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. ప్రధాని పదవి నుంచి తప్పుకుంటానని నేడు ప్రకటించారు. కొత్త నాయకత్వాన్ని ఎన్నుకునేంత వరకు పదవిలో కొనసాగుతానని తెలిపారు. ఆ తర్వాత రాజీనామా చేస్తానని వివరించారు. నూతన ప్రధానిని ఎన్నుకునేందుకు వీలుగా మార్చి 24 వరకు పార్లమెంటును పొడిగిస్తున్నానని ట్రూడో వెల్లడించారు. కెనడాలో చోటుచేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో ట్రూడోకు ఇటీవల కాలంలో సొంత పార్టీలోనే సెగ మొదలైంది. ఆయన తప్పుకోవాలంటూ సొంత పార్టీ నేతలే డిమాండ్ చేస్తున్నారు. కాగా, తాను ప్రధాని పదవికి రాజీనామా చేయనున్న విషయాన్ని పార్టీకి, గవర్నర్ కు తెలియజేశానని ట్రూడో ఓ ప్రకటనలో వెల్లడించారు.

కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో తన పదవికి రాజీనామా చేయనున్నారు. రానున్న 48 గంటల్లో లిబరల్ పార్టీ నాయకుడిగా రాజీనామా చేయనున్నారని మెయిల్, గ్లోబ్ పేర్కొన్నాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు రానున్న ఎన్నికల్లో ప్రజావ్యతిరేకత దృష్ట్యా పరిస్థితులను ముందే ఊహించి ఆయన తన పదవికి రాజీనామా చేయనున్నట్టు ప్రపంచ మీడియా సంస్థలు పేర్కొన్నాయి.

# ఏ అభివృద్ధి కార్యక్రమమైనా కుప్పంలో ప్రయోగించాకే రాష్ట్రంలో అమలు చేస్తాం

**పీఎం సూర్య ఘర్ కింద కుప్పంలో ప్రతి ఇంటికి సౌర పలకలు ఏర్పాటు చేస్తామన్న సీఎం**
**కుప్పంను పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని ప్రతి ఇంటికి సోలార్ ప్యానల్స్ అమర్చుతామని వెల్లడి**
**ఇప్పుడు మన ఇంటి పైనే విద్యుత్ తయారవుతోందన్న చంద్రబాబు**

రాష్ట్రంలో ఏ అభివృద్ధి కార్యక్రమం చేపట్టాలన్నా మొదట కుప్పంలో ప్రయోగించాకే రాష్ట్రమంతటా అమలు చేస్తానని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. కుప్పం నియోజకవర్గంలోని నడిమూరు గ్రామంలో పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ పైలట్ ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పీఎం సూర్య ఘర్ కింద నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి వంద శాతం రాయితీతో సౌర పలకలు ఏర్పాటు చేసి విద్యుత్ అందించడమే అందించడమే తన లక్ష్యం అన్నారు. కుప్పంను పైలట్ ప్రాజెక్టుగా తీసుకుని ప్రతి ఇంటికీ సోలార్ ప్యానల్స్ అమర్చుతామన్నారు. మన ఇంటి పైనే కరెంటు ఉత్పత్తి చేసుకోవడం చాలా గొప్ప విషయమన్నారు. తన చిన్నప్పటి రోజుల్లో కరెంటు సరిగా ఉండేది కాదని గుర్తు చేసుకున్నారు. లాంతర్ల దగ్గర చదువుకునేవాళ్లమన్నారు. కరెంట్ ఎక్కడో తయారవుతుందని, కానీ సౌర పలకల ద్వారా మన ఇంటి పైనే విద్యుత్ తయారవుతుందన్నారు.



# రేవంత్ రెడ్డికి ఢిల్లీ పెద్దలు సహకరించడం లేదు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎంతో చేయాలని ఉందని... కానీ ఢిల్లీ పెద్దలు ఆయనకు సహకరించడం లేదని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన పదేళ్ల పాలనలో రూ. 7 లక్షల కోట్లు అప్పు చేశారని... రాష్ట్రాన్ని దోచుకున్నారని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంతో చేయాలని ఉన్నా... రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోవడం వల్ల అనుకున్నంతగా చేయలేకపోతోందని అన్నారు. తెలంగాణ అప్పు తీర్చేందుకు మాట్లాడదామని రేవంత్ రెడ్డి తనతో అన్నారని... తాను అందుకు అంగీకరించానని కేఏ పాల్ చెప్పారు. రేవంత్ వచ్చిన తర్వాత అప్పులు మరింత పెరిగాయని... దీంతో ఎన్నికల వాగ్దానాలను కూడా అమలు చేయలేకపోతున్నారని అన్నారు. రేవంత్ వాగ్దానాలు ఫెయిల్ అయ్యాయి కాబట్టే తాను రంగంలోకి దిగానని చెప్పారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కు కూడా ఎంతో చేయాలని ఉన్నప్పటికీ చేయలేకపోతున్నారని కేఏ పాల్ వ్యాఖ్యానించారు.

# చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఎప్పుడూ రైతుల మేలు కోసమే ఆలోచిస్తారు

గత ప్రభుత్వం రైతులను విస్మరించింది అంటూ రాష్ట్ర పౌరసరఫరాలు, ఆహార శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సోషల్ మీడియాలో స్పందించారు. వైసీపీ వాళ్లు రైతులకి ధాన్యం డబ్బులు కూడా సక్రమంగా ఇవ్వలేదనే వాస్తవాన్ని గణాంకాలే చెబుతున్నాయని విమర్శించారు. కానీ కూటమి ప్రభుత్వం రైతుల కుటుంబాల్లో సంక్రాంతి తీసుకువచ్చిందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎప్పుడూ రైతుల మేలు కోసమే ఆలోచిస్తారని నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. "జనవరి 5వ తేదీ నాటికి ఖరీఫ్ సీజన్లో 4,15,066 మంది రైతుల నుంచి 27,00,00 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేశాము. బాధ్యతలు విస్మరించిన గత ప్రభుత్వం నాటి ఖరీఫ్ లో 2,12,431 మంది నుంచే ధాన్యం తీసుకొంది. మా ప్రభుత్వం ధాన్యం సేకరణ చేయడమే కాదు 24 గంటల లోపు రైతుల ఖాతాలకు సొమ్ము జమ చేస్తోంది. రూ.6,083.69 కోట్లు చెల్లింపులు చేశాం" అని నాదెండ్ల వివరించారు.

# రఘురామ నివాసంలో కార్యకర్తలతో భేటీ అయిన నారా లోకేశ్

ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన పార్టీ కార్యకర్తలతో లోకేశ్ మాట్లాడుతూ... నాయకుల పర్యటనల్లో ఎటువంటి హంగు, ఆర్భాటాలు వద్దని స్పష్టం చేశారు. అహంకారం , విచ్చలవిడితనం ప్రజలు అంగీకరించరని పేర్కొన్నారు. "జగన్ హయంలో జరిగిన విధ్వంసం వలన రాష్ట్రానికి తీవ్ర నష్టం కలిగింది. నెలకి రూ.4 వేల కోట్ల లోటు బడ్జెట్ తో రాష్ట్రం నడుస్తుంది. ఎన్ని ఇబ్బందులు ఉన్నా పెన్షన్ ఒకేసారి వెయ్యి రూపాయిలు పెంచాం, దేశంలో అత్యధిక పెన్షన్ ఇస్తున్నది మనమే. అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే అన్న క్యాంటీన్లు తెరిచాం, ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నాం.ఇచ్చిన ప్రతి హామీ క్రమపద్ధతిలో అమలుకు కృషిచేస్తున్నాం. మనల్ని ప్రశ్నించే హక్కు జగన్ కు లేదు" అని స్పష్టం చేశారు. రఘురామ నివాసం నుంచి భీమవరంలోని కేంద్ర సహాయమంత్రి శ్రీనివాసవర్మ గృహాన్ని మంత్రి లోకేశ్ సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి ఇంటి దగ్గర మూడు పార్టీల కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "రాష్ట్రంలో గత అరాచక పాలన అంతమొందించేందుకు అన్ కండిషనల్ గా ఎన్డీయే కి మద్దతు పలికాం. అందుకే రాష్ట్ర అభివృద్ధి కి కేంద్రం కూడా సహకరిస్తుంది. రాజమండ్రి సభలో ప్రధాని ఎన్ని సీట్లు గెలుస్తాం అని అడిగితే 22 ఎంపీ సీట్లు గెలుస్తాం అని చెప్పాను, 21 సీట్లు గెలిచాం. నాటి సైకో పాలనలో మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు నాయకులు నలిగిపోయారు. అందరూ కలిసికట్టుగా పనిచేస్తేనే రాష్ట్రం బాగుపడుతుంది. దేశ సమగ్రత కోసం అందరూ కలిసి పనిచేయాలి. 2047 వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకునేందుకు అందరూ ప్రధాని నాయకత్వాన్ని బలోపేతం చేయాలి" అని లోకేశ్ కోరారు. ఈ సమావేశంలో శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యేలు పులివర్తి రామాంజనేయులు (భీమవరం), కామినేని శ్రీనివాస్ (కైకలూరు) తదితరులు పాల్గొన్నారు.

# పనుల్లో పారదర్శకత పెంచేలా!

వాంకిడి: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో జరుగుతున్న అవకతవకలను నిర్మూలించేందుకు కేంద్రప్రభుత్వం ప్రత్యేకదృష్టి సారించింది. పారదర్శకత, జవాబుదారీతనం మరింత పెంచి అవకతవకలకు చెక్ పెట్టేందుకు జన్‌మన్‌రేగ యాప్ ఆవిష్కరించింది. కూలీలు పని హాజరు, జాబ్‌కార్డు, మస్టర్‌ల వివరాలు, డబ్బుల చెల్లింపులు, యాప్‌లో చూసుకోవచ్చు. ఖాతా వివరాలు సరిగ్గా లేకపోవడం, చేసిన పని డబ్బులు ఖాతాల్లో జమ కాకపోవడంతో చాలామంది కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక మీదట వారు ఈ యాప్‌లో కూలీ చెల్లింపు ఆలస్యానికి కారణాలు ఇతర వివరాలు తెలుసుకోవచ్చు. ప్రభుత్వం ఈ యాప్‌ను రూపొందించినప్పటికీ ఇంకా ప్రజల్లోకి వెళ్లలేదు. దీంతో చాలా మంది కూలీలు డబ్బులు పడకపోవడం తదితర సమస్యలతో కార్యాలయాల చుట్టూ తిరుగుతన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో కూలీలకు యాప్‌పై అవగాహన కల్పిస్తే ప్రయోజనకరంగా ఉంటుందిఈ యాప్‌ను సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకొని ఓపెన్ చేసిన తర్వాత రాష్ట్రం, జిల్లా, మండలం, గ్రామాన్ని ఎంపిక చేసుకోవాలి. అనంతరం జాబ్‌కార్డు నంబర్‌ను నమోదు చేస్తే కూలీకి సంబంధించిన వివరాలు వస్తాయి. పనిరోజులు, హాజరు, ఖాతాలో పడిన డబ్బులు వంటి సమగ్ర సమాచారం కనిపిస్తుంది. డబ్బులు జమకాకపోతే ఎందుకు కాలేదో కారణం కూడా ఈ యాప్‌లో తెలుస్తుంది. గ్రామాల వారీగా జరిగిన పనులు, ఖర్చు వవరాలు కూడా తెలుసుకోవచ్చు. అవకతవకలపై ఫిర్యాదు కూడా చేయవచ్చు.శ్రావణ్, ఉపాధిహామీ ఏపీవో, వాంకిడి జన్‌మన్‌రేగా యాప్‌లో ఉపాధిహామీ పథకానికి సంబంధించి పూర్తి సమాచారం అందుబాటులో ఉంటుంది. యాప్‌లో జాబ్‌కార్డు ఉన్న ప్రతివ్యక్తి వివరాలు కనిపిస్తాయి. ఇతరులు కూడా గ్రామాల వారీగా జరుగుతున్న పనులు, ఖర్చుల వివరాలు తెలుసుకోవచ్చు. కూలీలు కార్యాలయాల చుట్టు తిరిగి ఇబ్బందులు పడకుండా ఈయాప్ దోహదపడుతుంది. ఉపాధిహామీలో ఏమైనా అవకతవకలు జరిగితే ఫిర్యాదు కూడా చేసుకోవచ్చు. ఈ యాప్‌పై కూలీలకు అవగాహన కల్పిస్తున్నాము. కూలీలు ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి.

# 2026 మార్చి నాటికి దేశంలో నక్సల్స్ కథ ముగిస్తాం

ఛత్తీస్ గఢ్ లో మావోయిస్టులు పంజా విసిరిన ఘటనలో 9 మంది జవాన్లు మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రస్థాయిలో స్పందించారు. వచ్చే ఏడాది కల్లా దేశంలో మావోయిస్టులు ఎవరూ ఉండరని స్పష్టం చేశారు. దేశంలో 2026 మార్చి నాటికి నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని చెప్పారు. నక్సల్స్ దాడిలో జవాన్ల మృతి పట్ల అమిత్ షా సంతాపం తెలియజేశారు. బీజాపూర్ జిల్లాలో నక్సల్స్ ఐఈడీ పేలుడుకు పాల్పడిన నేపథ్యంలో డీఆర్ జీ జవాన్లు మృతి చెందడం తనను తీవ్ర విచారానికి గురిచేసిందని పేర్కొన్నారు. ఆ వీర జవాన్ల కుటుంబాల్లో నెలకొన్న వేదనను మాటల్లో చెప్పలేమని పేర్కొన్నారు. వీర జవాన్ల ప్రాణత్యాగాలు వృథా కానివ్వబోమని ప్రతిజ్ఞ చేశారు. భారతదేశ గడ్డపై నక్సల్స్ ను పూర్తిగా తుడిచిపెట్టేస్తామని స్పష్టం చేశారు.

Editor, printer, published Owned by CHINTHALA RAMAKRISHNA Gummadidala (M&V) SANGAREDDY DIST TELANGANA State 502313 ph 8499902850/RNI NO:TELTEL/2022/81794